సాక్షి
కాకినాడ

ఆదివారం । 21 । సెప్టెంబర్ । 2025



ఈటీసీ.. శిక్షణలో మేటి

పదోన్నతులు పొందిన ఉద్యోగులకు వారి విధులు, బాధ్యతలపై సామర్లకోటలోని విస్తరణ శిక్షణ కేంద్రం (ఈటీసీ)లో శిక్షణ ఇస్తారు.



కలసిమెలషి

కుటుంబం సక్రమంగా నడవడంలో భార్య పాత్ర కీలకం. అడగడుగునా ఆమె సాయం అవసరం. ఆదివారం భార్యల ప్రశంసా దినోత్సవం సందర్భంగా కథనం.

II లో

మిగులు జలాల విడుదల




ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం రాత్రి 5,18,811 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 4,200, మధ్య డెల్టాకు 1,400, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు.

న్యూస్‌రీల్

శృంగార వల్లభుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

రూ.2.53 లక్షల ఆదాయం



భక్తుల నుంచి పూజలందుకుంటున్న తిరుపతి శృంగార వల్లభ స్వామి

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందుల తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు స్వామిని పూలదండలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని వివిధ సేవల టిక్కెట్లు, అన్నదానం, కేశ ఖండన ద్వారా స్వామి వారికి రూ.2,53,756 ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. సుమారు 18 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకోగా నాలుగు వేల మంది భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, గ్రామ సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, ఆలయ సిబ్బంది అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అన్నవరప్పాడుకు భక్తుల రద్దీ



విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లు

పెరవలి: అన్నవరప్పాడులోని వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం వేల మంది భక్తులు పోటెత్తారు. స్వామివారికి అభిషేకం నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. పెద్దసంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్‌లో రద్దీ ఏర్పడింది. వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అభివృద్ధి కమిటీ ప్రత్యేక చర్యలు తీసుకుంది. బండారు సుబ్బారావు దంపతుల ఆర్థిక సాయంతో సుమారు ఎనిమిది వేల మందికి అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మాట్లాడుతూ ఆలయంలో నూతనంగా ప్రవేశపెట్టిన స్వామికి పూల అలంకరణ, భక్తులకు ప్రసాదం, నిత్యగోత్రార్చన, అన్నదానాల కు భక్తుల నుంచి విరాళాలు స్వీకరిస్తున్నామన్నారు.

రాష్ట్ర స్థాయి వెయిట్, పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక

అమలాపురం టౌన్: రాష్ట్ర స్థాయి వెయిట్, పవర్ లిఫ్టింగ్ పోటీలకు అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ క్రీడాకారులు ఎంపికయ్యారని ఆ జిమ్ లైఫ్ టైమ్ మెంబర్ గారపాటి చంద్రశేఖర్ తెలిపారు. ఇటీవల కాకినాడలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వెయిట్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుడు జి.దినేష్ ప్రసాద్ అండర్–17 విభాగం 79 కిలోల కేటగిరీలో బంగారు పతకం, పవర్ లిఫ్టింగ్ అండర్–19 74 కిలోల కేటగిరీలో కె.నాని బంగారు పతకం, 83 కిలోల కేటగిరీలో వి.సోమశేఖర్ బంగారు పతకాన్ని సాధించారని చెప్పారు. బంగారు పతకాలు సాధించిన ఈ ముగ్గురూ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం జిమ్‌లో జరిగిన అభినందనలో జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు, నేషనల్ వెయిట్ లిఫ్టర్ మారే వీరేంద్ర, సీనియర్ లిఫ్టర్లు జె.జితేంద్రదొర, ఎం.అవినాష్, సీహెచ్ సత్యగోపాల్, చోడే శంకర నారాయణ పాల్గొని విజేతలను ప్రశంసించారు.

పాఠాలు నేర్పేరా?

- అనుమతులపై కొరవడిన నిఘా
- ప్రారంభం కాని పాఠశాలల తనిఖీ
- ఏటా వదుల సంఖ్యలో ప్రారంభం
- కొన్నింటికే అనుమతులున్నాయని విద్యార్థి సంఘాల గగ్గోలు
- మీనమేషాలు లెక్కిస్తున్న విద్యాశాఖ

రేపటి సమాజానికి ఉత్తమ పౌరులను తీర్చిదిద్దాల్సిన బృహత్తర బాధ్యత గురువులదే. ఆ గురువులు ఎంతమంది నిష్ణాతులో.. ఎంతమంది కేవలం 'గురూ' అని పిలిపించుకునేవారో తెలియని పరిస్థితి నేటి పాఠశాలల్లో ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యత ప్రమాణాలు.. విద్యా ప్రగతి.. విద్యార్థుల అభ్యసన తదితర వివరాలను సహజంగానే ఆ శాఖ అధికారులు నిర్వహిస్తారు. ఎటొచ్చీ ప్రైవేటు పాఠశాలల విషయంలోనే ఈ బాధ్యతను గుర్తెరిగి వ్యవహరించడం లేదన్నది నిర్వివాదాంశం. క్వాలిఫైడ్ టీచర్లు లేని పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థుల పరిస్థితి రేపు ఏమిటన్నది ప్రశ్నార్థకమవుతోంది. ప్రభుత్వం గుర్తించని పాఠశాలల యాజమాన్యాలు విద్యా సంవత్సరం చివరిలో గుర్తింపు పొందిన పాఠశాలల నుంచి విద్యార్థులను పరీక్షలకు పంపించి వారి పబ్బం గడుపుకొంటున్నారు. ఈ పరిస్థితి ఏటా అక్కడక్కడా బయటపడుతూనే ఉన్నా విద్యాశాఖ మొద్దు నిద్ర వీడడం లేదు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ఈ తనిఖీలు చేపడితే విద్యార్థులకు వెంటనే గుర్తించిన పాఠశాలల్లో చేరే అవకాశం ఉంటుంది. ఆలస్యం జరిగే కొద్దీ ఆయా పాఠశాలల్లో సీట్లు దొరకక విద్యా సంవత్సరాన్ని నష్టపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే విద్యా సంవత్సరం మొదలై మూడు నెలలైంది. అధికారులు ఇప్పటికైనా సమాయత్తమై విద్యార్థులు ప్రైవేటుకు బలికాకుండా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.



గుర్తింపు లేని పాఠశాలలు మూసివేయాలంటూ ఆందోళన చేస్తున్న విద్యార్థులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లా విద్యాశాఖ గణాంకాల ప్రకారం ప్రాథమిక 152, ప్రాథమికోన్నత 202, ఉన్నత పాఠశాలలు 219 కలిపి మొత్తం 573 పాఠశాలలకు మాత్రమే గుర్తింపు ఉందంటూ లెక్కల్లో నమోదయింది. కాకినాడ జిల్లా వ్యాప్తంగా అనధికారికంగా ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ 50–70, ఉన్నత పాఠశాలలు మరో 50 వరకూ ఉంటాయని అంచనా వేస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా.. ఇప్పటికీ ఈ ఏడాది జిల్లాలో గుర్తింపు పొందిన పాఠశాలల జాబితా పూర్తి స్థాయిలో లేదు. డివిజన్, మండల స్థాయిలో విద్యాశాఖాధికారులు పాఠశాలల తనిఖీ చేపట్టి గుర్తింపు లేని పాఠశాలలపై కొరడా ఝుళిపించేవారు. ముఖ్యంగా కాకినాడ కార్పొరేషన్ వంటి ప్రాంతంలో అర్బన్ స్కూల్ ఆర్‌ఐ అధికారులు తనిఖీలు చేపట్టి ఏటా కనీసం 10 పాఠశాలలైనా గుర్తించి వాటిపై చర్యలు తీసుకునేవారు. ఈ విద్యాసంవత్సరంలో అటువంటి చర్యలు ఎక్కడా తీసుకున్న దాఖలాలు లేవు. ఏటా కొత్త పాఠశాలలు జిల్లాలో పుట్టుకొస్తున్నా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల తోక పేర్లతో నూతన బ్రాంచిల పేరిట వివిధ ప్రాంతాల్లో ప్రారంభిస్తున్నారు. ఇందుకు హంగులూ, ఆర్భాటాలతో తల్లిదండ్రులను ఆకర్షించేందుకు ప్రచారాలు చేస్తూ ప్రవేశాల ప్రక్రియను చేపడుతున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను అటువంటి పాఠశాలల్లో చేర్పించేందుకే ఆసక్తి కనబరుస్తున్నారు. అయితే విద్యార్థుల తల్లిదండ్రులకు ఆయా పాఠశాలలకు అనుమతి ఉన్నదీ లేనిదీ తెలియని పరిస్థితి. ఈ విషయంలో తల్లిదండ్రులకు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. విద్యాశాఖ నియంత్రణ కొరవడడంతో ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే ఆమోదం ఉన్నట్లు నిర్దేశించుకుంటూ కొన్ని పాఠశాలలు సీబీఎస్ఈ అనుమతులు ఉన్నట్లు ప్రచారం చేస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొత్త ప్రైవేటు పాఠశాల ప్రారంభించాలంటే విద్యాశాఖ అనుమతి తీసుకోవాలి. మొదటి ఓపెనింగ్ అనుమతి తీసుకున్న తర్వాతే విద్యా సంస్థలను తెరచి విద్యార్థులను చేర్చుకోవాలి. తర్వాత పూర్తి స్థాయి అనుమతి పొందాలి. ప్రాథమిక స్థాయికి జిల్లా విద్యాశాఖ అధికారి నుంచి, ఉన్నత తరగతులు ప్రారంభించాలంటే విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్ (ఆర్జేడీ) ద్వారా పాఠశాల విద్యా కమిషనర్ అనుమతి తీసుకోవాలి. అలాగే ముఖ్యంగా సీబీఎస్ఈ సిలబస్ బోధించేందుకు కేంద్ర విద్యామండలి సమ్మతించాలి. గత విద్యా సంవత్సరం మెట్ట ప్రాంతం జగ్గంపేటలో ఓ కార్పొరేట్ పాఠశాల తమకు అన్ని అనుమతులు ఉన్నాయంటూ ప్రచారాలు చేసుకుని ప్రవేశాలు కల్పించింది. ఈ విషయంపై అవగాహన లేక కొందరు తమ పిల్లలను అందులో చేర్పించారు. పుస్తకాలు తీసుకున్నారు. వేలల్లో ఫీజులు చెల్లించాక పాఠశాలలను మరో పాఠశాలలోకి విలీనం చేశారంటూ తల్లిదండ్రులు ఆందోళన చేశారు.

కచ్చితంగా గుర్తింపు పొంది ఉండాలి

చాలా విద్యాసంస్థల బోర్డులు, ప్రకటనలు నిశితంగా పరిశీలిస్తే రిజిస్టర్డ్ అని ఉంటుంది. రిజిస్ట్రేషన్ ఎవరైనా చేసుకోవచ్చు, కానీ విద్యాశాఖ నుంచి గుర్తింపు తీసుకోవడం తప్పనిసరి. గుర్తింపు పొందిన విద్యాసంస్థల్లోనే తల్లిదండ్రులు పిల్లలను చేర్పించాలి. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా కొన్ని పాఠశాలలు ఇతర విద్యాసంస్థల తరఫున పరీక్షలు రాయిస్తుంటారు. అలా పరీక్ష రాసిన విద్యార్థులను ప్రభుత్వం ప్రైవేటు విద్యార్థిగానే పరిగణిస్తుంది. మరికొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు బ్రాంచీల పేరుతో పాఠశాలలను, కళాశాలలను నడుపుతూ ఎక్కడో ఉన్న మెయిన్ బ్రాంచి ద్వారా పరీక్షలు రాయిస్తుంటారు. ఇలాంటి విషయాల్లో తల్లిదండ్రులు కచ్చితంగా విద్యా సంస్థ అనుమతి పత్రాలను అడిగి తెలుసుకోవాలి.

గమనించాల్సిన విషయాలివీ..

- **తొలుత పాఠశా**లకు ప్రభుత్వ గుర్తింపు ఉందా **లేదా అనేది చూ**సుకోవాలి.
- **ప్రభుత్వ ఇంజి**నీరింగ్ విభాగం జారీ చేసిన **పాఠశాల భ**వనం నాణ్యత ధ్రువీకరణ **పత్రాన్ని పరిశీలి**ంచాలి.
- **మౌలిక వసతు**లు చూసుకోవాలి.
- **మరుగుదొడ్లు,** నీటి సదుపాయాలు తప్పనిసరి. **విద్యార్థులు మా**నసిక, శారీరకోల్లాసానికి ఉపకరించే **క్రీడా ప్రాం**గణం, అనుగుణంగా క్రీడా ఉ**పాధ్యాయులు ఉ**న్నారా లేదా అని ఆరా తీయాలి.
- **ప్రాథమిక, ప్రాథ**మికోన్నత స్థాయిలో 20 నుంచి **40 మందికి** ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. ఉన్నత పాఠశాల అయితే సబ్జెక్టుల వారీగా ఒకరు చొప్పున ఉపాధ్యాయుడు ఉండాలి.
- సురక్షిత రవాణా సదుపాయానికి బస్సులకు రవాణాశాఖ సామర్థ్య పరీక్ష పత్రాన్ని జారీ చేస్తుం ది. సుశిక్షితుడైన డ్రైవరు తప్పనిసరి.
- జీ–1 భవనాలు ఉంటే అగ్నిమాపక పరికరాలు, స్థాయి దాటితే మంటలు ఆర్పే పూర్తి స్థాయిలో ఉండాలి.
- ప్రభుత్వం అనుమతి లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పితే భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తుతాయి.
- చైల్డ్ ఇన్ఫో ఆధారంగానే విద్యార్థుల ప్రగతి పత్రాలు, బదిలీ ధ్రువపత్రాలు జారీ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ అనుమతి లేని వాటిలో ఈ నమోదు ఉండదు. ఆయా విద్యార్థులను బడిబయట ఉన్నవారిగా పేర్కొంటున్నారు. ఫలితంగా సమస్యలు ఏర్పడతాయి.

గుర్తింపు జాబితా విడుదల చేస్తాం



ప్రతి ప్రైవేటు విద్యా సంస్థ ప్రభుత్వ నిబంధనలను తు.చ తప్పకుండా పాటించాలి. విద్యార్థులకు పాఠశాలల్లో క్రీడా మైదానంతో పాటు అన్ని వసతులు ఉండాలి. లేకుంటే ఈ పాఠశాల గుర్తింపు రద్దు చేస్తాం. విద్యాసంస్థ పక్కాగా రిజిస్ట్రేషన్తో పాటు ప్రభుత్వ గుర్తింపు ఉండాలి. ప్రతి ఏడాదిలానే ఈ ఏడాది గుర్తింపు పొందిన పాఠశాలల వివరాలు తెలియజేస్తాం.

– జి.నాగమణి, విద్యాశాఖ ఆర్‌జేడీ. కాకినాడ

విద్యార్థుల జీవితాలతో చెలగాటం



తమ ఉన్న ఇంటికో లేదో గ్రామానికో దగ్గరగా ఉంటుందన్న కారణంలో ప్రైవేట్ పాఠశాల్లో తమ పిల్లలను చేర్పిస్తున్నారు. కనీసం ఆ స్కూళ్లకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయో లేదో కూడా తల్లిదండ్రులకు తెలియడం లేదు. సరైన వసతులు కూడా ఉండటం లేదు. తీరా పరీక్షల సమయం వచ్చేసరికి వేరే పాఠశాల నుంచి పరీక్షలు రాయిస్తున్నారు.

– బి.సిద్ధూ, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి

సమస్యలు పరిష్కరించే వరకూ ఉద్యమం ఆగదు



రిలే నిరాహార దీక్ష చేస్తున్న విద్యుత్ ఉద్యోగుల కార్మిక సంఘ నాయకులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): సమస్యలు పరిష్కరించే వరకూ ఉద్యమం ఆగదని విద్యుత్ ఉద్యోగుల కార్మిక సంఘ నాయకులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల కార్మికుల ఉమ్మడి ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపు మేరకు దీర్ఘకాలిక సమస్యల సాధన కోసం దశల వారి ఆందోళనలో భాగంగా విద్యుత్ సర్కిల్ ఆఫీస్ ప్రాంగణం వద్ద విద్యుత్ కార్మికులతో రిలే నిరాహార దీక్ష రెండో రోజు శనివారం కొనసాగించారు. కార్యక్రమంలో 50 మంది రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. వారికి మద్దతుగా సుమారు 150 మంది తమ సంఘీభావాన్ని తెలియజేశారు. యాజమాన్యం ఇంతకుముందే అంగీకరించినప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు చేయని పలు డిమాండ్ల సాధన కోసం ఈ దశల వారి ఆందోళన కార్యక్రమం చేపట్టామన్నారు. ఉద్యోగులకు ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్ పింఛన్ విధానానికి అమలు చేయాలని, జేఎల్ఎం గ్రేడ్–2 ఉద్యోగులను సంస్థలో విలీనం చేసి ప్రమోషన్లు కల్పించాలని, త్రైపాక్షిక ఒప్పందానికి విరుద్ధంగా ఇచ్చిన నూతన సర్వీస్ రెగ్యులేషన్ రద్దు చేయాలన్నారు, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి వివిధ యూనియన్లు, అసోసియేషన్ల నాయకులు వి.బాలకుమార్, బి.హైదిరాజు, ఎస్.మురళీకృష్ణ, ఎన్ఎస్ నాయుడు, కె.బాబి, ఎం.సూర్యనారాయణ పాల్గొన్నారు.

శరన్నవరాత్ర ఉత్సవాలకు సర్వం సిద్ధం

పిఠాపురం: పాదగయ క్షేత్రంలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న శరన్నవరాత్ర ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పాదగయలో దసరా ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేయగా పిఠాపురం నియోజకవర్గంలో అమ్మవారి ఆలయాలు సర్వాంగ సుందరంగా తయారయ్యాయి. ఈనెల 22 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ ఏడాది 11 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనుండగా అమ్మవారు కాత్యాయనిదేవిగా ప్రత్యేక అవతారంలో దర్శనమివ్వనున్నారు. రోజుకో అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. పిఠాపురం పాదగయ క్షేత్రంలో వెలసిన అష్టాదశ శక్తి పీఠాల్లో 10వ శక్తి పీఠం అయిన పురూహూతికా అమ్మవారు, రాజరాజేశ్వరిదేవి, తాటిపర్తిలో వేంచేసిన అపర్ణాదేవి అమ్మవార్ల ఆలయాలను శరన్నవరాత్ర ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశారు.

ఉద్యోగి... విసిగి విసిగి

- దగాకోరు 'కూటమి'పై పోరుబాట
- సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగుల డిమాండ్
- 25న విజయవాడలో ఉపాధ్యాయుల 'రణభేరి' సభ
- విద్యుత్, సచివాలయ సిబ్బంది నిరసన గళం

కొత్తపేట: వినీ విని విసిగిపోయారు.. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ఆక్రోశంతో ఉన్నారు.. ప్రజా పాలనలో ప్రభుత్వానికి చేదోడుగా ఉంటున్నా తమను పట్టించుకోవడం లేదంటూ నిరసన స్వరం వినిపిస్తున్నారు.. ప్రభుత్వ తీరుపై ప్రజలే కాకుండా ఉద్యోగ, ఉపాధ్యాయులు పోరుబాట పట్టారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావొస్తున్నా ఎన్నికల హామీలు అమలు చేయకపోవడంపై ఇప్పటికే విద్యార్థులు, రైతులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఇతర శాఖల ఉద్యోగులు నిరసన తెలుపుతున్నారు. ప్రస్తుతం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో విద్యుత్ శాఖ, సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఒక్కసారిగా నిరసనలకు దిగుతున్నారు. ప్రభుత్వంపై పోరుబాటకు సిద్ధమయ్యారు.

తమ శాఖాపరమైన సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగులు ఉద్యమ బాట పట్టారు. ఈ మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో విద్యుత్ శాఖల యూనియన్లలో సుమారు 4 వేల మంది సమైఖ్యంగా నిలిచారు. ఈ నెల 15, 16 తేదీల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. 17, 18 తేదీల్లో భోజన విరామ సమయంలో నిరసన, 19, 20 తేదీల్లో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. 22న అన్ని జిల్లా కేంద్రాల్లో శాంతియుత ర్యాలీ, కలెక్టరేట్‌కు వెళ్లి వినతిపత్రాలు సమర్పించనున్నారు. అప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోతే తదుపరి కార్యాచరణ నిర్ణయిస్తామని హెచ్చరించారు.



బొమ్మూరులో రిలే నిరాహార దీక్ష చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

డిమాండ్లు ఇవీ

- విద్యుత్ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు పూర్తి వైద్య ఖర్చులు చెల్లించాలి.
- రాష్ట్ర ప్రభుత్వంలో అమలులో ఉన్న జీపీఎఫ్‌తో కూడిన పెన్షన్ నిబంధనలను 1999 ఫిబ్రవరి 1 నుంచి 2024 ఆగస్టు 31 వరకు నియమితులైన ఉద్యోగులందరికీ వర్తింపజేయాలి.
- ఎన్నో ఏళ్ల నుంచి పనిచేస్తున్న కాంట్రాక్ట్ లేబర్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు యాజమాన్యమే నేరుగా వేతనాలు చెల్లించాలి.
- దీర్ఘకాలిక సర్వీసున్న వారందరినీ విద్యుత్ సంస్థలలో విలీనం చేయాలి. వారికి సంబంధించి మరో 4 డిమాండ్లు పరిష్కరించాలి.
- కారుణ్య నియామకాలు కల్పించడంలో కొత్త పేర్లు పెట్టి కన్సాలిడేటెడ్ పే ఇస్తున్న పద్ధతిని వెంటనే రద్దు చేసి, నాలుగు దశాబ్దాల నుంచి అమలులో ఉన్న పద్ధతినే కొనసాగించాలి. 2019లో నియమింపబడిన ఎనర్జీ అసిస్టెంట్లు (జేఎల్ఎం గ్రేడ్-2)లను రెగ్యులర్ జేఎల్ఎంలుగా పరిగణించి వేతనాలు, తదితర ప్రయోజనాలు కల్పించాలి. వాటితో సహా 17 డిమాండ్లు ప్రభుత్వం ముందుంచారు.

ఉపాధ్యాయుల 'రణభేరి'

ఆర్థిక, విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ యూటీఎఫ్ నేతృత్వంలో ఉపాధ్యాయులు నిరసనలు చేపడుతున్నారు. ఈ మేరకు 25న విజయవాడలో భారీ ఎత్తున బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఇప్పటికే ఈ నెల 11 నుంచి దశల వారీగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేశారు. ఇందులో భాగంగా బైక్ జాతా ర్యాలీ నిర్వహించారు.

ఇవీ డిమాండ్లు

- ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే చెల్లించాలి.
- సీపీఎఫ్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలి.
- 12వ పీఆర్సీని నియమించి, ఐఆర్ ప్రకటించాలి.
- అన్ని రకాల బకాయిలను వెంటనే చెల్లించాలి.
- యాప్‌ల భారంతో పాటు బోధనేతర పనులను ఎత్తివేయాలి.
- ఈహెచ్ఎస్ పరిమితిని రూ 25 లక్షలకు పెంచాలి.


సచివాలయ ఉద్యోగుల నిరసన గళం

దాదాపు ఏడాదిన్నరగా ఎన్నో వేధింపులను మౌనంగా భరిస్తూ వచ్చిన సచివాలయ ఉద్యోగుల్లోనూ చివరకు సహనం నశించింది. ఈ నేపథ్యంలో తమ ఆత్మ గౌరవాన్ని పణంగా పెట్టలేక నిరసన గళం విప్పారు. ఇంటింటికీ వెళ్లి వాట్సప్ సేవలపై ప్రచారం చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. అవసరమైతే నిరవధిక నిరసనకు సిద్ధమని ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేశారు.

ఇవీ డిమాండ్లు

- విధులకు సంబంధం లేని సర్వేలు, ఇతర పనుల నుంచి విముక్తి కలిగించాలి.
- శాఖల వారీగా మాతృ శాఖల్లో విలీనం చేయాలి.
- సచివాలయాల్లోని అన్ని విభాగాల ఉద్యోగులకు ఒకే బేసిక్‌తో పదోన్నతి కల్పిస్తూ పీఆర్సీ శ్లాబ్ వర్తింపజేయాలి.
- సెలవు రోజుల్లో బలవంతపు విధుల నుంచి విముక్తి కల్పించాలి.
- రికార్డు అసిస్టెంట్ క్యాడర్‌ను జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌గా అప్‌గ్రేడ్ చేయాలి.
- ప్రొబేషన్ కాలానికి నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలి.


ఉద్యమం ఉధృతం చేస్తాం



విద్యుత్ శాఖ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని యాజమాన్యాన్ని కోరుతూ ఈ నెల 15 నుంచి వివిధ రూపాల్లో దశల వారీగా నిరసన కార్యక్రమాలు చేపట్టాం. ప్రస్తుతం రిలే నిరాహార దీక్షలు చేస్తున్నాం. తమ డిమాండ్లు వెంటనే పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం.

– జగత అచ్యుతరామయ్య, చైర్మన్, విద్యుత్ ఉద్యోగ సంఘాల జేఏసీ, బొమ్మూరు (రాజమహేంద్రవరం)

ప్రభుత్వ వైఖరిని ఎండగడతాం..



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలి. ఉపాధ్యాయులకు, విద్యారంగ పరిరక్షణ కోసం చేసే పోరాటాన్ని ప్రభుత్వం అర్థం చేసుకుని సమస్యలు పరిష్కరించాలి. ఈ నెల 25న సుమారు 10 వేల మందితో విజయవాడలో రణభేరి పేరిట భారీ బహిరంగ సభ నిర్వహిస్తాం. ప్రభుత్వ వైఖరిని ఎండగడతాం.

– ఎస్.జ్యోతిబసు, రాష్ట్ర కార్యదర్శి, యూటీఎఫ్, రావులపాలెం

సత్యదేవునికి ఘనంగా జన్మనక్షత్ర పూజలు

- ఆలయ ప్రాకారంలో ఊరేగింపు
- స్వామిని దర్శించిన 30 వేల మంది భక్తులు
- ఆదాయం రూ.30 లక్షలు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరంలో శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి జన్మనక్షత్రం 'మఖ' సందర్భంగా శనివారం స్వామి, దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి, శంకరుల మూల విరాట్‌లకు పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేకపూజలు, ఆయుష్యహోమం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున రెండు గంటలకు స్వామివారి ఆలయం తెరచి సుప్రభాత సేవ నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవారు, శంకరులు మూలవిరాట్‌లకు పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవారిని పట్టువస్త్రాలు, సుగంధభరిత పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు. యాగశాలలో స్వామికి ఆయుష్య హోమం నిర్వహించారు.



తిరుచ్చి వాహనంపై ఆలయ ప్రాకారంలో స్వామి, అమ్మవార్లను ఊరేగిస్తున్న దృశ్యం

ఉదయం తొమ్మిది గంటలకు ఆయుష్య హోమం ప్రారంభించి 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు నీరాజనమంత్రపుష్పాలు సమర్పించి ప్రసాదాలు నివేదించారు.

ఐదు వేల మందికి అన్నదానం

శనివారం సుమారు 30 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. సత్యదేవుని సర్వదర్శనానికి గంట, రూ.200 టికెట్‌పై అంతరాలయ దర్శనానికి అరగంట సమయం పట్టింది. 1,600 వ్రతాలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షలు ఆదాయం సమకూరింది. ఐదు వేల మంది అన్నదానం స్వీకరించారు.

కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, అర్చకుడు కోట వంశీ, వేదపండితులు యనమండ్ర శర్మ, ఉపాధ్యాయుల రమేష్, వ్రత పురోహితులు పాలంకి పట్టాభిరామ్మూర్తి, పరిచారకుడు యడవిల్లి ప్రసాద్ తదితరులు నిర్వహించారు. ఆలయ ప్రాకారంలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని తిరుచ్చి వాహనంపై ఘనంగా ఊరేగించారు. వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య మంగళవాయిద్యాల నడుమ పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రాగా మూడు సార్లు ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. తిరిగి స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయానికి చేర్చారు.

క్లుప్తంగా

వాడపల్లి క్షేత్రం.. భక్తజన సంద్రం


ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లిలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం అశేష భక్తజనంతో కిక్కిరిసింది. దేవదాయ – ధర్మాదాయశాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు. స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంత శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు పూజలు జరిపారు. ఆలయంలో వేంకటేశ్వర సహిత ఐశ్వర్య లక్ష్మీహోమం నిర్వహించారు. ఏడు శనివారాల నోము ఆచరిస్తున్న భక్తులు మాడ వీధుల్లో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఏడు ప్రదక్షిణలు చేశారు. రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఆత్రేయపురం ఎస్సై ఎస్.రాము వాడపల్లిలో ట్రాఫిక్‌ను నియంత్రించి, క్షేత్రంలో శాంతి భద్రతలను పర్యవేక్షించారు. కాగా. దేవస్థానానికి శనివారం ఒక్కరోజే వివిధ రూపాల్లో రూ.61,08,522 ఆదాయం లభించింది. .

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	31,500
గటగట (వెయ్యి)	30,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	28,500
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

ఈటీసీ.. శిక్షణలో మేటి

- మెరుగైన శిక్షణకు చిరునామాగా విస్తరణ కేంద్రం
- సామర్లకోటలో ఏర్పాటు
- విధులపై ఉద్యోగులకు అవగాహన

సామర్లకోట: ప్రతి ఉద్యోగికి తన విధులపై పూర్తి స్థాయి అవగాహన చాలా అవసరం. అప్పుడే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలుగుతారు. విధి నిర్వహణలో మెరుగ్గా వ్యవహరిస్తారు. దీని కోసమే సామర్లకోటలో విస్తరణ శిక్షణ కేంద్రం ఏర్పాటైంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు తదితర 11 జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులకు ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు.

ఎంపీడీఓలకు శిక్షణ

సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రంలో ప్రస్తుతం పదోన్నతి పొందిన ఎంపీడీఓలకు శిక్షణ ఇస్తున్నారు. వీరందరూ మండల పరిషత్తు కార్యాలయంలో ఈఓపీఆర్డీ, పరిపాలనాధికారి, జిల్లా పరిషత్తు సీనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తూ పదోన్నతి పొందారు. ఈ నేపథ్యంలో వారికి పరిపాలనా అనుభవం రావడానికి నెల రోజుల పాటు శిక్షణ ఇస్తున్నారు. దీనిలో భాగంగా మొదటి బ్యాచ్‌కు జూలై 28 నుంచి ఆగస్టు 26 వరకు శిక్షణ పూర్తి కాగా, రెండో బ్యాచ్‌ను ఈ నెల 8న ప్రారంభించారు. అక్టోబర్ 10 వరకూ వీరి శిక్షణ కొనసాగుతుంది. ఈ బ్యాచ్‌తో ఎంపీడీఓల శిక్షణ పూర్తవుతుందని ఈటీసీ అధికారులు తెలిపారు.


సామర్లకోటలోని విస్తరణ శిక్షణ కేంద్రం


శిక్షణ పొందుతున్న ఎంపీడీఓలు

వివిధ అంశాలపై..

సుమారు 105 ఎకరాల విస్తీర్ణంలో 1952లో వీడీఓల శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. దీనికి చెందిన స్థలాలను బీసీ, ఎస్సీ, హాస్టళ్లతో పాటు సామాజిక ఆరోగ్య కేంద్రానికి కూడా కేటాయించారు. వీడీఓల శిక్షణ కేంద్రం క్రమేపీ విస్తరణ శిక్షణ కేంద్రంగా మారింది. పంచాయతీ రాజ్ చట్టంపై పూర్తి స్థాయి అవగాహన పెంచుకొనే విధంగా ప్రస్తుతం ఎంపీడీఓలకు శిక్షణ ఇస్తున్నారు. పంచాయతీరాజ్ చట్టం 1994, మండల ప్రజాపరిషత్తు పరిపాలన, మండల పరిషత్తు అధికారి విధులు–బాధ్యతలు, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల అమలులో ఎంపీడీఓ పాత్ర, మండల పరిషత్తులో మౌలిక వసతుల కల్పన, మండల ప్రజాపరిషత్తు పరిపాలనా వికేంద్రీకరణ, కార్యాచరణ కమిటీల ఏర్పాటు– వాటి సమావేశాలు, మండల పరిషత్తు సమావేశాల నిర్వహణ, మండల విద్యాశాఖాధికారి విధులు–బాధ్యతలు, మండల ఇంజినీరింగ్ అధికారి విధులు–బాధ్యతలు, మండల పరిషత్తు రిజిస్టర్ల నిర్వహణ, బడ్జెట్ తయారీ, గ్రామ పంచాయతీలపై పర్యవేక్షణ, ఆర్థిక సంఘ నిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీల విధులు–అధికారాలు, గ్రామ సభ నిర్వహణ, స్థానిక ఎన్నికలు, సచివాలయ సిబ్బంది జాబ్ చార్టు, జలజీవన్ మిషన్, గ్రామ పంచాయతీ ఆడిట్–అవగాహన, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు తదితర వాటిపై అవగాహన కల్పిస్తున్నారు.

అవగాహన పెరిగింది

ఈటీసీలో ఇచ్చిన శిక్షణతో అనేక విషయాలపై అవగాహన పెరిగింది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఎంపీడీఓలతో కలిసి ఉండటం వల్ల కొత్త విషయాలు తెలుసుకునే అవకాశం కలిగింది. పది రోజుల శిక్షణలో ఎంపీడీఓల విధులు, బాధ్యతలు తదితర వాటిని పూర్తిస్థాయిలో వివరించారు. సీసీఏ రూల్స్‌తో పాటు ప్రతి రోజు రెండు అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. కేంద్రంలో భోజన, వసతి సౌకర్యాలు చాలా బాగున్నాయి. జిల్లా పరిషత్తు కార్యాలయంలో పనిచేస్తూ ఎంపీడీఓగా పదోన్నతి పొందాను.

– కొవ్వూరి నరేంద్రరెడ్డి, పెదపూడి మండలం, కాకినాడ జిల్లా

ప్రతి ఉద్యోగికీ శిక్షణ అవసరం

ప్రతి ఉద్యోగికి శిక్షణ ఎంతో అవసరం. విస్తరణ కేంద్రం పరిధిలోని 11 జిల్లాల్లో పదోన్నతులు పొందిన ఎంపీడీఓలకు ఇక్కడి ఫ్యాకల్టీలు శిక్షణ ఇస్తున్నారు. ఇలా 11 జిల్లాల్లో 83 మందికి శిక్షణ పూర్తి చేశాం. కొత్తగా పదోన్నతి పొందిన వారికి ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన తరువాత శిక్షణ ప్రారంభిస్తాం. పదోన్నతి పొందిన ఉద్యోగికి శిక్షణ వల్ల విధి నిర్వహణపై అవగాహన ఏర్పడుతుంది. మెరుగైన సేవలు అందించటానికి అవకాశం ఉంటుంది.

– కేఎస్‌వీ ప్రసాదరావు, ఈటీసీ ప్రిన్సిపాల్, సామర్లకోట

కలసిమెలషి

- కుటుంబానికి ఆమె ఆధారం
- జీవిత పయనంలో భర్తకు చేదోడువాదోడు
- నేడు భార్యల ప్రశంసా దినోత్సవం



రాయవరం: కుటుంబం అనే బండి సక్రమంగా నడవాలంటే భార్యభర్తలు కలసిమెలసి పయనించాలి. దారిలో ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా ధైర్యంగా అడుగులు ముందుకు వేయాలి. ఈ ప్రయాణంలో భార్యల పాత్ర చాలా కీలకం. కార్యేషు దాసీ..కరణేషు మంత్రి..భోజ్యేషు మాత....అంటూ జీవిత భాగస్వామితో భార్య ఎలా ఉండాలో మన పూర్వీకులు చెప్పారు. అందమైన జీవితం, ఆరోగ్యకర సమాజం, చక్కటి కుటుంబానికి మూలం వైవాహిక బంధం. సంసార రథ చక్రం సాఫీగా పరుగు తీసేందుకు ఇరుసు ధర్మపత్ని. కుటుంబానికి చుక్కాని ఆమె. ఈ నేపథ్యంలో ఏటా సెప్టెంబర్ మూడో ఆదివారం ప్రపంచ భార్యల ప్రశంసా దినోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం

సర్దుబాటు తప్పనిసరి

సంసార జీవనం సాఫీగా సాగిపోవాలంటే సర్దుబాటు తప్పనిసరి. సాధక, బాధలను సహృదయంతో అర్థం చేసుకోవాలి. కుటుంబం, భర్త, పిల్లలు, బంధువులపై చూపే విధేయత, వినయం, త్యాగం ధర్మపత్నికే చెల్లుతుంది. అయితే అదనపు కట్నం కావాలనో పరస్త్రీ వ్యామోహంలోనో భార్యలను వేధించే భర్తలున్నారు. చాలామంది మాత్రం భార్యలను గౌరవిస్తూ, అభిమానిస్తూ ప్రేమగా చూసుకుంటున్నారు. కలిసిమెలసి పయనిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

భార్యపై ప్రేమతో..



కరోనా కారణంగా 2021 మే 22న నా భార్య సత్యవేణి ఆకస్మికంగా మృతి చెందింది. ఆమె చూపిన ప్రేమాభిమానాలు ఇప్పటికీ నన్ను కదిలిస్తాయి. నిత్యం నా కళ్ల ముందు ఆమె రూపం నిలవాలనే తలంపుతో మందిరం ఏర్పాటు చేసుకుని, దానిలో నా భార్య విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నాను. ప్రస్తుతం అడ్వకేట్‌గా ప్రాక్టీస్ చేస్తూనే రోజూ మందిరానికి వెళ్లి భార్య విగ్రహాన్ని చూస్తుంటాను.

– కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, విశ్రాంత లెక్చరర్, పసలపూడి, రాయవరం మండలం

ఆమెతోనే జీవితం



భార్యగా దుర్గాభవాని రావడంతో నా జీవితం మలుపు తిరిగింది. భార్యాభర్తలు అంటే ఒకరిపై ఒకరికి ప్రేమ, నమ్మకం, గౌరవం ఉండాలి. నేను ఎప్పుడూ ఆమెతో అలాగే ప్రవర్తిస్తాను. తన ఇష్టాలను, అలవాట్లను గౌరవిస్తాను. ఆమె కూడా నా విషయంలో అలాగే ఉంటుంది. కుటుంబం సాఫీగా ముందుకు సాగాలంటే నమ్మకంగా చాలా అవసరం. అప్పుడే ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీవితం ఆనందంగా సాగిపోతుంది.

– భార్యతో యండమూరి శ్రీనివాస్, ఎస్‌జీటీ, మధురవారిపేట, ఉప్పలగుప్తం మండలం

నలుగురు దొంగల అరెస్ట్

శంఖవరం: ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు అన్నవరం ఎస్సై శ్రీహరిబాబు తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ కాకినాడకు చెందిన పాలెపు సతీష్, బలసాడి సతీష్, బర్నికల లక్ష్మణరావు, పంతాడి సత్యసాయి ముఠా ఏర్పడి ఇళ్లలో బంగారం, వెండి వస్తువులను చోరీ చేస్తున్నారన్నారు. పక్కా సమాచారం మేరకు వారిని కత్తిపూడి వై.జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుల నుంచి రూ.75 వేలు విలువైన ఒక జత వెండి పట్టీలు, ఒక వెండి చెంబు, టీవీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిని కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

సూర్యారావుపేట బీచ్‌లో క్లీన్ అప్ డ్రైవ్


కార్యక్రమంలో పాల్గొన్న ఇండియన్ కోస్టగార్డులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

కాకినాడ రూరల్: అంతర్జాతీయ తీర ప్రాంత శుభ్రతా దినోత్సవం (ఇంటర్నేషనల్ కోస్టల్ క్లీన్ అప్ డే) సందర్భంగా సూర్యారావుపేటలోని న్యూ ఎన్టీఆర్ బీచ్‌లో శనివారం ఉదయం క్లీన్ అప్ డ్రైవ్ నిర్వహించారు. ఇండియన్ కోస్టగార్డ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ సంస్థలు, స్వచ్ఛంద సేవకులు, విద్యార్థులు పాల్గొని, సుమారు వెయ్యి కిలోల చెత్త, వ్యర్థాలను సేకరించారు. వాటిని కాకినాడ కార్పొరేషన్‌కు అప్పగించారు. ఓఎన్‌జీసీ ఈడీ, అసెట్ మేనేజర్ రత్నేష్ కుమార్, ఇండియన్ కోస్టగార్డ్, రిలయన్స్, వేదాంత ఆయిల్స్, సీ పోర్టు, మెరైన్ పోలీసులు, పతంజలి, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, కాకినాడ కార్పొరేషన్ సిబ్బంది, వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన సుమారు విద్యార్థులు మూడు గంటల పాటు శ్రమదానం చేసి 2.5 కిలోమీటర్ల తీరాన్ని శుభ్రం చేశారు.

పురుగుమందు తాగి యువకుడి ఆత్మహత్య

తొండంగి: పురుగుమందు తాగిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై బి.జగన్మోహన్‌రావు శనివారం తెలిపిన వివరాల ప్రకారం .. తొండంగి గ్రామానికి చెందిన గాబు శివాజీ (22) ఈ నెల 18 అర్ధరాత్రి ఇంటి వద్ద గడ్డి మందు తాగాడు. అతడు వాంతులు చేసుకుంటుండగా గమనించిన తల్లిదండ్రులు స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం తుని ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. కాగా.. శివాజీ తల్లిదండ్రులైన గాబు అనంతలక్ష్మి, విష్ణు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తమ కుమారుడి మృతికి గ్రామానికి చెందిన మల్లిపాము గంగాధర్, ఉమ్మిడి దేవిశ్రీ ప్రసాద్, మల్లిపాము తేజ కారణమన్నారు. గంగాధర్ వివాహేతర సంబంధాన్ని గ్రామంలో ప్రచారం చేశాడని ఆరోపిస్తూ తరచూ శివాజీని చంపుతామని బెదిరించేవారన్నారు. ఈ నెల 4న వినాయక నిమజ్జనంలో కూడా ప్రసాదం పంచే విషయంలో గొడవ పడ్డారని, వారం రోజుల క్రితం ఒంటిమామిడి నుంచి ఇంటికి వస్తుండగా దారి కాచి బీరు బాటిల్‌తో దాడి చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై వివరించారు.

త్వరలో ఆల్ ఇండియా బెస్ట్ ఫిజిక్ పోటీలు

- 'నన్నయ'లో నిర్వహించేందుకు సన్నాహాలు
- వెల్లడించిన వీసీ ఆచార్య ప్రసన్న శ్రీ


స్వామి రమేష్ కుమార్‌ను సత్కరిస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో త్వరలో ఆల్ ఇండియా బెస్ట్ ఫిజిక్ పోటీలు నిర్వహించనున్నామని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. ఆమె శనివారం యూనివర్సిటీని సందర్శించిన ఇండియన్ బాడీ బిల్డర్స్ ఫెడరేషన్ (ఐబీబీఎఫ్)అధ్యక్షుడు స్వామి రమేష్ కుమార్‌తో వివిధ రకాల క్రీడా పోటీలు, నిర్వహణపై చర్చించారు. స్పోర్ట్సు బోర్డు మీటింగ్ ఏర్పాటు చేసి బెస్ట్ ఫిజిక్ పోటీల నిర్వహణకు కమిటీలు, తేదీలను ఖరారు చేస్తామన్నారు. ఈ పోటీల నిర్వహణలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యూత్ ఐకాన్స్‌ను తీసుకువచ్చి, యూనివర్సిటీ విద్యార్థులకు స్ఫూర్తినిచ్చేలా కార్యక్రమాలు రూపొందించనున్నామన్నారు. దీనిలో భాగంగా బాక్సింగ్ క్రీడాకారిణి, పద్మ విభూషణ్ మేరీ కోమ్, ప్రపంచ అథ్లెటిక్స్‌లో బంగారు పతకాలు అందుకున్న తొలి భారతీయ మహిళ అథ్లెట్ హిమదాస్ వంటి వారిని త్వరలోనే తీసుకువచ్చి, విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తామన్నారు. యూనివర్సిటీలో విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యతనిస్తూ, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను కనబరిచే విధంగా క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామన్నారు. స్వామి రమేష్ కుమార్ మాట్లాడుతూ తెలుగువాడినైన తనకు ఐబీబీఎఫ్ అధ్యక్షుడిగా అవకాశం లభించడం ఆనందంగా ఉందన్నారు. నన్నయ వర్సిటీలో త్వరలో జరిగే ఆల్ ఇండియా బెస్ట్ ఫిజిక్ పోటీలకు ఐబీబీఎఫ్ చేయూతనిస్తుందన్నారు. అనంతరం స్వామి రమేష్ కుమార్‌ను వీసీ ప్రసన్నశ్రీ సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు, పీడీలు పాల్గొన్నారు.

గురుకులం పైనుంచి పడి విద్యార్థికి తీవ్ర గాయాలు

అల్లవరం: గోడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులంలో ఇంటర్ చదువుతున్న జానపాటి విజయ్ కుమార్ గురుకులం పైఅంతస్తు నుంచి ప్రమాదవశాత్తూ జారి పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన వివరాల్లోకి వెళితే.. అమలాపురం రూరల్ మండలం జనుపల్లె గ్రామానికి చెందిన విజయ్ కుమార్ గురుకులం రెండో అంతస్తుపై ఆరబెట్టిన బట్టలను తీసుకునేందుకు శుక్రవారం సాయంత్రం వెళ్లాడు. అక్కడ కళ్లు తిరగడంతో పైఅంతస్తు నుంచి పడిపోయాడని ప్రిన్సిపాల్ నక్కా శ్రీనివాస్ తెలిపారు. ఈ ప్రమాదంలో విజయ్ కుమార్ రెండు కాళ్ల మడమలకు, వెన్నెముకకు తీవ్ర గాయాలయ్యాయి. అతడికి అమలాపురంలోకి కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం కిమ్స్‌లో ఐసీయూ విభాగంలో విజయ్ కుమార్ చికిత్స పొందుతున్నాడు.

రాష్ట్ర స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థినులు


రాష్ట్రస్థాయి అట్యా పాట్యా పోటీలకు ఎంపికైన బాలికలు


రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికైన కళాశాల విద్యార్థినులు

తుని రూరల్: జిల్లా స్థాయిలో జరిగిన బాలికల అట్యా, పాట్యా, అండర్ – 19 జూడో ఎస్‌జీఎఫ్ పోటీల్లో తుని మండలం వి.కొత్తూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల విద్యార్థినులు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ డి.ప్రసన్నరాణి శనివారం విలేకరులకు తెలిపారు. అట్యా పాట్యా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల ఏడున వి.కొత్తూరులో జిల్లా స్థాయి పోటీలు జరిగాయన్నారు. వాటిలో ప్రతిభ కనబర్చిన తమ పాఠశాలకు చెందిన 17 మంది విద్యార్థినులు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. పల్నాడు జిల్లా నకిరికల్లులో ఈ నెల 25, 26 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి అట్యా పాట్యా పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. అలాగే జగ్గంపేటలో ఈ నెల 19న జరిగిన అండర్ – 19 జూడో ఎస్‌జీఎఫ్ పోటీలలో తమ కళాశాలకు చెందిన సీహెచ్ సత్య, వి. అఖిల ప్రథమ, సీహెచ్.ప్రియాంక, యుధారాణి ద్వితీయ స్థానాల్లో నిలిచారన్నారు. దీంతో వీరు రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యారని, ఆ పోటీలు ఎప్పుడు జరిగేదీ దసరా శరన్నవరాత్ర ఉత్సవాలు ముగిసిన తర్వాత తెలుస్తుందన్నారు. ఆయా క్రీడల్లో పీడీ ఆర్.జయలక్ష్మి, పీఈటీ జి.సుజాత శిక్షణ ఇచ్చారన్నారు.


జూడో పోటీలకు ఎంపికైన ఏలేశ్వరం గురుకులం విద్యార్థులు

జూడో పోటీలకు..

ఏలేశ్వరం: రాష్ట్ర స్థాయిలో జరిగే అండర్–19 జూడో పోటీలకు పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలకు చెందిన డి.కీర్తన, జె.సాయి లావణ్య, వై.రమ్య ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శనివారం కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ చంద్ర శారద ఆ విద్యార్థినులను అభినందించారు. జగ్గంపేటలో జరిగిన పోటీల్లో వీరు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు.